క్లుప్తంగా

ఇంటి ముంగిటకే వైద్యసేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. శ్రీరంగంపల్లె గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికీ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలను అందజేశారు. అనంతరం మంచాన పడ్డ రోగుల ఇంటి వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రెజ్వాన, అన్నపూర్ణ, శిరీషా, శివగామి పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

యాదమరి(బంగారుపాళెం): ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త వహించాలని యాదమరి సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం యాదమరి ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఉదయం 10 గంటలకు పైన ఎవరూ ఎండలో తిరగరాదని హెచ్చరించారు. సాయంత్రం 4 గంటల తరువాత బయటకు వెళ్లాలన్నారు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, తలకు రుమాలు, టోపీ వాడాలన్నారు. వడదెబ్బ బారిన పడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు వేసుకోవాలి


మహిళలకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

తవణంపల్లె: గర్భిణులు ఐరన్ మాత్రలు విధిగా వేసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం దిగువ మోదపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ 45 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ పావని, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు సౌందర్య, నాగభూషణ పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరుని సేవలో పంచశక్తి పీఠాధిపతి


ఆలయంలో అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న స్వామీజీలు

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టులో వెలసిన త్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయానికి సోమవారం పంచశక్తి స్థాపకులు శక్తియేంద్ర స్వామి, పంచశక్తి పీఠాధిపతి జ్ఞానశక్తి యేంద్ర స్వామి విచ్చేశారు. వారికి ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం స్వాగతం పలికారు. పూజలనంతరం వారు ఆలయానికి స్వర్ణాకర్షక భైరవ సన్నిధి ఆవరణలో ప్రతిష్టించడానికి శాండిల్‌స్టోన్‌ను అందించారు. భక్తులకు అన్నప్రసాదాలను వితరణగా అందించారు. నేత్రదేవత దేశమ్మను కూడా వారు దర్శించుకున్నారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి


సుబ్రమణ్యంరెడ్డి (ఫైల్)

గుడిపాల: మండలంలోని గొల్లమడుగులో సుబ్రమణ్యంరెడ్డి(64) సోమవారం వడదెబ్బతో మృతి చెందాడు. ఇంటి వద్ద నుంచి పాడి పశువులకు తన పొలాల వద్దకు మధ్యాహ్నం ఎండలో తోలుకు పోయాడు. ఎండ వేడిమి తట్టుకోలేక అక్కడే కుప్పకూలిపోయాడు. పక్క పొలాల వారు గమనించి అతన్ని ఆస్పత్రికి తరలించేలోపు అతను మృతిచెందాడు.

పోటీలో 12 మంది అభ్యర్థులు

- ఆర్వో చిన్నయ్య

పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేసిన అభ్యర్థుల్లో 12 మంది మాత్రమే పోటీపడుతున్నట్లు ఆర్వో చిన్నయ్య తెలిపారు. మంగళవారం 12 మంది అభ్యర్థుల్లో ఎవ్వరూ ఉపసంహరించుకోలేదని, వారు మాత్రమే పోటీలో ఉన్నట్లు పేర్కొన్నారు. పోటీలో వైఎస్సార్‌సీపీ పార్టీ తరఫున డాక్టర్ సునీల్‌కుమార్, టీడీపీ మురళిమోహన్, సమాజ్‌వాదీపార్టీ పురుషోత్తం, జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎం ఎస్ బాబు, బీసీపీ నాగేశ్వర, అఖిలభారత జనసంఘ్ విశ్వనాథ సాయి మోహన్, విడుదలై చిరుతంగల్ కచ్చి పార్టీ సంతోష్, అఖిల భారత మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ నవీన్‌కుమార్, భారత చైతన్య యువజన పార్టీ హరిప్రసాద్, స్వతంత్ర అభ్యర్థులుగా విజయభాస్కర్, ప్రవీణ్‌కుమార్ ఉన్నట్లు ఆయన తెలిపారు.

చిత్తూరు: చామంతిపురంలో కార్పొరేటర్ ఇందు ప్రచారం



గురునగర్‌కాలనీలో రావూరి ఈశ్వర్‌రావు ప్రచారం



ఇరువారంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ప్రచారం



ఫ్యాను గుర్తుకు ఓటేస్తే సంక్షేమ రాజ్యం

- చంద్రబాబుకు ఓటేస్తే సంక్షోభం తప్పదు
- జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య
- చిత్తూరు, గుడిపాల మండలాల్లో ప్రచారం


గుడిపాల: వసంతాపురం పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గుడిపాల: గొల్లమడుగు పంచాయతీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడిపాల: ఫ్యాను గుర్తుకు ఓటేసి, జగనన్నను మళ్లీ సీఎం చేసుకుంటే సంక్షేమ రాజ్యం వస్తుందని, చంద్రబాబుకు ఓటేస్తే సంక్షోభం తప్పదని జెడ్పీవైస్ చైర్‌పర్సన్ రమ్య పేర్కొన్నారు. మండలంలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మండలంలోని గుడిపాల, వెప్పాలమానుచేను, నంగమంగళం, మందిక్రిష్టాపురం, గొల్లమడుగు, కమ్మతిమ్మాపల్లె, వసంతాపురం, కుప్పిగానిపల్లె, 189 కొత్తపల్లె, కమ్మతిమ్మాపల్లె, వెంగమాంబపురం, నారగల్లు పంచాయతీల్లో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, సర్పంచులు గోపి, జయకోడి, రజినీకాంత్, మధుసూదన్‌రాయల్, జనార్దన్, పెరిల్లా ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్నకు ఓటేస్తే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే సంక్షేమ పథకాలన్నీ పేదల ముంగిట్లోకి వస్తాయని గుర్తుచేశారు. చంద్రబాబుకు ఓటేస్తే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వస్తుందని, సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రతి ఒక్కరూ ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేయాలన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ అందిస్తున్న పింఛన్లను కావాలనే తెలుగుదేశం పార్టీ వారు అడ్డుకొని వృద్ధులు, వికలాంగులు, వితంతువులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిలంబరసన్, కారిమేఘన్, రెడ్డెప్ప, గుండు సాయి, సుశేంద్రా, వెంకటేష్‌రెడ్డి, కలైఅరసి, కుమార్,మోహన్‌నాయుడు, రఘు, క్రిష్ణన్‌తో పాటు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఏనుగుండ్లపల్లిలో ఎన్నికల ప్రచారం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం ఏనుగుండ్లపల్లి గ్రామంలో సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పాండియన్, విశాల్‌రెడ్డి, మురగారెడ్డి, నరేష్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, మురుగన్, హరి, శివయ్య, శంకర్, రామ్‌బాబు, రమేష్, మణి పాల్గొన్నారు.

నగరంలో ప్రచారం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. పలు డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లుగా జరిగిన అభివృద్ధిని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే కూటమి నాయకులను నమ్మవద్దన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చిన మాట నెరవేర్చే జగనన్నకు ఓటు వేయాలని కోరారు. గురునగర్‌కాలనీలో బీసీ నాయకులు రావూరి ఈశ్వర్‌రావు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలన్నారు. ఆయన వెంట పార్టీ నగర అధ్యక్షులు టిమ్ము ఉన్నారు. ఇరువారంలో నాయకులు డేవిడ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. చిన్న పిల్లల నుంచి అవ్వా, తాతల వరకు జరిగిన మేలును తెలియజేశారు. చామంతిపురంలో కార్పొరేటర్ ఇందు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మహిళలకు జరిగిన మేలును తెలియజేశారు. చవటపల్లెలో నాయకులు కరుణాకరన్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.






గుడిపాల: 189కొత్తపల్లెలో ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, **చిత్తూరు:** చవటపల్లెలో ఓటడుగుతున్న స్థానిక నాయకులు, **గుడిపాల:** మందిక్రిష్టాపురంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారం, నంగమంగళంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైభవంగా వసంతోత్సవాలు ప్రారంభం


తిరుచ్చి వాహనంపై దర్శనమిస్తున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు


ఉత్సవమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో సోమ వారం వసంతోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, పంచాగశ్రవణం వంటి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల నడుమ ఉత్సవమూర్తులకు వేద పండితులు వేదమంత్రాలు పఠిస్తూ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ సమర్పణ చేపట్టారు. అనంతరం అలంకార మండపానికి స్వామి వార్లను వేంచేపు చేసి పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్టించి గ్రామ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 8.45 గంటలకు వేద పండితులు స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్‌కుమార్ వేద పండితులు గోపాలాచారి, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

హీరో కార్ల పరిశ్రమను చిత్తూరుకు తీసుకొస్తాం!

చిత్తూరు అర్బన్ : హీరో కార్ల పరిశ్రమను చిత్తూరుకు తీసుకొస్తామని చెప్పడంతో స్థానికులు అయోమయానికి గురయ్యారు. టీడీపీ నేతలు చిత్తూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ హాజరై ప్రసంగించడం ప్రజలను తికమకకు గురిచేసింది. నగరంలోని గాంధీ విగ్రహం వద్ద సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో బాలయ్య ప్రసంగానికి జనం తలలు పట్టుకున్నారు. బాలకృష్ణ మాట్లాడుతూ కోవిడ్‌కు చంద్రబాబు వ్యాక్సిన్ కనిపెట్టి ఎందరినో బతికించారని చెప్పడంతో అందరూ నోరెళ్లబెట్టారు. టీడీపీని గెలిపిస్తే చిత్తూరుకు హీరో కార్ల పరిశ్రమ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. హీరో స్కూటర్ల పరిశ్రమకు కార్ల పరిశ్రమకు తేడా తెలియడం లేదని టీడీపీ నాయకులే నవ్వుకున్నారు. కన్నతల్లినీ, కూడా పుట్టిన చెల్లినీ వదిలేసిన వ్యక్తి జగన్ అంటూ బాలయ్య ప్రసంగించారు. దీంతో 'బాలయ్యా.. ఇదేం గోలయ్యా' అనుకుంటూ ఆ పార్టీ శ్రేణులు అక్కడి నుంచి వెళ్లిపోయాయి.

పక్కాగా సామాజిక పింఛన్ల పంపిణీ


మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో మే నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పక్కాగా పంపిణీ చేయాలని, ఇందుకోసం వార్డు సచివాలయం స్థాయిలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నగర కమిషనర్ అరుణ పేర్కొన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ, ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలపై సోమవారం నగరపాలక కార్యాలయంలో మెప్మా అధికారులతో, వీడియో సమావేశం ద్వారా వార్డు అడ్మిన్, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నూతన మార్గదర్శకాల ప్రకారం సామాజిక పింఛన్లను డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా, డోర్ టు డోర్ ద్వారా పంపిణీ చేయాలన్నారు. నగరపాలక పరిధిలో మొత్తం 16,627 పెన్షన్లు ఉండగా, ఇందులో 11,587 పింఛన్లు డీబీటీ ద్వారా, 5,040 పింఛన్లు డోర్ టు డోర్ అందించనున్నట్లు తెలిపారు. ఎవరెవరికి ఏ విధానంలో పంపిణీ చేయాలన్న జాబితా క్లస్టర్ వారీగా ఉందని, ఈ జాబితా ప్రకారం లబ్ధిదారులకు కాల్ చేసి వివరాలు తెలియజేసి వారు ఎలాంటి ఆందోళన లేకుండా పింఛన్లు పొందేలా చూడాలన్నారు. సచివాలయల్లో పింఛన్ల జాబితాను ప్రదర్శించాలన్నారు. డీబీటీ విధానంలో ఎవరికైనా బ్యాంకులో పింఛన్ సొమ్ములు జమకానిపక్షంలో వారికి మరుసటి రోజు నిధులను డ్రా చేసి ఇంటి వద్ద పంపిణీ చేయాలని సూచించారు. బ్యాంకులో జమ అయిన సొమ్ములను ఎప్పుడైనా తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. లబ్ధిదారులు ఎండలో తగిన జాగ్రత్తలు తీసుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి ప్రతి 10 వార్డులకు ఒక సూపర్‌వైజర్ అధికారిని నియమించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, సీవోలు పాల్గొన్నారు.

రైతు ఇంటికే వ్యవ'సాయం'

- రైతు భరోసా కేంద్రాలతో గ్రామాల్లోనే అన్ని సేవలు
- రాయితీ విత్తనాలు, ఎరువులు లభ్యం
- పశువులకు వైద్య సేవలు అందుబాటులోకి
- ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు


గ్రామాల్లోనే పశువులకు వైద్య సేవలు అందిస్తున్న పశు వైద్యులు (ఫైల్)


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రైతు భరోసా కేంద్రం సిబ్బంది (ఫైల్)

నియోజకవర్గ సమాచారం

మొత్తం రైతు భరోసా కేంద్రాలు -	30
సొంత భవనాలు ఉన్న కేంద్రాలు -	11
మొత్తం సాగు విస్తీర్ణం -	5,826 హెక్టార్లు
సాగుకు ఎరువుల పంపిణీ -	2,350 టన్నులు
రైతు భరోసా పొందిన రైతులు -	13,383 మంది
ప్రభుత్వం వెచ్చించిన మొత్తం -	రూ. 82.01 కోట్లు
సున్నా వడ్డీ -	6,557 మంది
రైతులకు -	రూ.1.67 కోట్లు జమ
పంటల బీమా -	6,028 మంది
రైతులకు -	రూ.1.40 కోట్ల లబ్ధి

చిత్తూరు అగ్రికల్చర్: వ్యవసాయానికి ప్రస్తుత ప్రభుత్వం పెద్దపీట వేసింది. నిత్యం రైతులకు అండగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి అన్ని విధాలా తోడ్పాటును అందించింది. రైతులకు అన్ని రకాల సేవలు ఇంటి ముంగిటే అందించాలన్న తలంపుతో గ్రామానికో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువులు, పశువులకు వైద్యం, భూసార పరీక్షలు, పంటల సాగులో సూచనలు-సలహాలు, ఈ క్రాప్ నమోదుతో ఉచిత పంటల బీమా వర్తింపు లాంటివి ఆయా గ్రామాల్లోనే ఏర్పాటు చేసింది. ఇందుకోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి అన్ని సేవలను రైతుల ముంగిట్లోకి తీసుకువచ్చింది. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 5,826 హెక్టార్ల విస్తీర్ణంలో ఏటా రైతులు సాగు చేస్తారు. ప్రధానంగా వరి, వేరుశనగ, మామిడి, చిరుధాన్యాల పంటలను పండిస్తారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రైతులకు పంటల సాగులో తోడ్పాటును అందించాలన్న తలంపుతో అన్ని సేవలను ఆయా గ్రామాల్లోనే అందించే విధంగా చర్యలు తీసుకుంది. ప్రతి గ్రామ పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు విత్తనాలు, ఎరువులు, పశువులకు వైద్యం గ్రామంలోనే లభ్యమయ్యేలా చర్యలు చేపట్టింది. అదేగాక పంటల సాగుకు ముందస్తు సలహాలు, సూచనలు అందించడం చేస్తోంది. ఈ-క్రాప్ నమోదు ఆధారంగా సాగైన పంటలకు ఉచిత బీమా కల్పిస్తోంది. ఇందుకు గాను చిత్తూరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 30 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో చిత్తూరు మండలం 13, గుడిపాల మండలంలో 17 కేంద్రాలు ఏర్పాటు చేసింది.

పశు వైద్య సేవలు

ప్రతి రైతు భరోసా కేంద్రంలో పశువులు, జీవాలకు వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల్లోనే పశువులు, జీవాలకు వైద్య సేవలను అందిస్తున్నారు. ఇప్పటివరకు 32 వేల పశువులు, 21 వేల జీవాలకు వైద్య సేవలు, టీకాలను వేశారు. దీంతోపాటు వీటి కోసం ప్రత్యేకంగా పశు వైద్య అంబులెన్సులు ఏర్పాటు చేశారు.

ఈ-క్రాప్‌తో ఉచిత బీమా

ఖరీఫ్, రబీ సీజన్లలో సాగైన పంటలను ఎప్పటికప్పుడు ఈ-క్రాప్ నమోదు చేపట్టి, ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఏటా 5,800 ఎకరాల మేరకు ఈ-క్రాప్ నమోదు చేసి ఉచిత బీమా కల్పించారు. పంటల సాగులో రైతులు ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో పొలంబడి నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు మొత్తం 6,028 పొలం బడులు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

భూసార పరీక్షలు

భూమి ఆధారంగా ఎలాంటి పంటలు వేయాలని ముందస్తుగా రైతులకు తెలిపేందుకు భూసార పరీక్షలను చేపడుతున్నారు. ఇప్పటివరకు 570 శాంపుల్స్ తీసి భూసార పరీక్షలు నిర్వహించారు. పంటల సాగులో ఏ పంటకు ఎలాంటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలన్న అంశాలపై రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన కల్పించడం. ఇందుకోసం ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీవీల ద్వారా రైతులకు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను తెలియజేయడం. అదేగాక యాజమాన్య పద్ధతులకు సంబంధించి పుస్తకాల లైబ్రరీని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

విత్తనాలు, ఎరువుల పంపిణీ


రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనాలను తీసుకుంటున్న రైతులు (ఫైల్)

పంటలసాగుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం రాయితీపై రైతు భరోసా కేంద్రాల వద్దనే రైతులకు అందిస్తోంది. ఇప్పటి వరకు 27,549 మంది రైతులకు రూ.4 కోట్ల మేరకు రాయితీపై వేరుశనగ, చిరుధాన్యాలు, తదితర విత్తనాలను అందించింది. అవసరమైన ఎరువులు, మందులను ఆర్బీకేలో అందుబాటులో ఉంచింది. కియోస్క్ మిషన్ ద్వారా ఎరువులు, మందులు అవసరమైన మేరకు నమోదు చేసుకుని ఎంఆర్‌పీకే పొందే వెసులుబాటు కల్పించింది. ఇప్పటివరకు మొత్తం 2,350 టన్నుల మేరకు ఎరువులను రైతులకు అందించింది.

అన్ని సేవలు అందుబాటులోకి..



రైతులకు అవసరమైన అన్ని సేవలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆయా గ్రామాల్లోనే అందుబాటులోకి తీసుకురావడం చాలా సౌకర్యవంతం. గతంలో ఇలాంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. దీంతో పంటల సాగుకు ఎంతో సౌకర్యంగా ఉంది.

–రఘునాథరెడ్డి, రైతు, గుడిపాల మండలం

పడిగాపులు తప్పాయి



గతంలో ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాల కోసం మండల కేంద్రాల్లోని వ్యవసాయశాఖ కార్యాలయాలకు వెళ్లి రోజుల తరబడి క్యూలలో పడిగాపులు కాయాల్సిన దుస్థితి. అయితే ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, మందులు పొందే వెసులుబాటును కల్పించారు. ఈ విధానం రైతులకు ఎంతో సౌకర్యవంతం.

–మురుగేష్, రైతు, గుడిపాల మండలం